క్లుప్తంగా

జాషువా జీవితం-సాహిత్యం పై వ్యాసరచన పోటీలు



సత్తెనపల్లి: విశ్వనరుడు గుర్రం జాషువా 52వ వర్ధంతి సందర్భంగా సత్తెనపల్లి పట్టణంలోని కవికోకిల శ్రీ గుర్రం జాషువా సాహితీ సేవా సంస్థ ఆధ్వర్యంలో 9వ తరగతి, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జాషువా జీవితం -సాహిత్యం అనే అంశంపై వ్యాసరచన పోటీలను స్థానిక ప్రగతి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఆదివారం నిర్వహించారు. వివిధ పాఠశాల నుంచి 116 మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని సంస్థ అధ్యక్ష కార్యదర్శులు ఇర్మియా, సురేష్ బాబు తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించి వ్యాసరచన పోటీలకు పంపించిన స్కూలు ఉపాధ్యాయులకు వారు ధన్యవాదములు తెలిపారు. ప్రకటించిన విధంగా విజేతలకు బహుమతులను త్వరలో అందిస్తామని తెలిపారు.

వేద పాఠశాల విద్యార్థులకు నూతన వస్త్రాలు పంపిణీ



సత్తెనపల్లి: పట్టణంలో గుంటూరు రోడ్‌లో గల శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమ వేద పాఠశాల విద్యార్థులకు స్థానిక అగ్నిమాపక శిక్షణ కేంద్ర ఉద్యోగి కూచిపూడి శ్రీనివాసరావు దంపతులు నూతన వస్త్రాలను అందజేశారు. ఆదివారం ఆశ్రమ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కుటుంబ సమేతంగా హాజరై విద్యార్థులకు వస్త్రాలను అందజేశారు. వారికి ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేద విద్యార్థులు ఆశీర్వచన నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. విద్యార్థులకు నూతన వస్త్రాలు అందించిన శ్రీనివాసరావు దంపతులకు వేద పాఠశాల గురువులు రత్నమాచార్యులు అభినందనలు తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే



అచ్చంపేట: మండలంలోని కస్తల గ్రామానికి చెందిన వేమవరపు నాగేశ్వరరావు ఇల్లు, చిన్న కిరాణా షాపు ఇటీవల పూర్తిగా దగ్ధం కాగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం రాత్రి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.10 వేలు తక్షణ సహాయంగా అందజేశారు. ప్రభుత్వ పరంగా అన్నిరకాలుగా ఆదుకుంటామని, పక్కా గృహాన్ని మంజూరు చేయిస్తానని చెప్పారు. కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటాన న్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మణిపూర్ దారుణాలకు నిరసనగా ర్యాలీ



క్రోసూరు: భారత దేశంలోని ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్ రాష్ట్రంలో గత 50 రోజులుగా జరుగుతున్న దారుణాలకు నిరసనగా లూథరన్ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ, మానవహారం చేపట్టారు. ర్యాలీ నిర్వహించి ,డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల సెంటర్‌లో మానవహారం చేపట్టి నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు హెప్సిబా, కృపారాజు, జాషువా, రాజ్‌కుమార్, మరియదాసు, మేరిబాబు, క్రోసూరు సంఘ పెద్దలు, మహిళలు, యువకులు భారీగా పాల్గొన్నారు.

క్రాంతి దళిత అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన

క్రోసూరు: అల్లర్లతో , మానభంగాలతో, మారణకాండలతో ప్రాణాలు అరచేత పట్టుకుని బ్రతుకుతున్న మణిపూర్ రాష్ట్రంలోని క్రైస్తవులను కాపాడాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఆదివారం క్రాంతి దళిత అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి దాసు అర్జీ అందచేసారు . క్రోసూరులో జరిగిన ఈకార్యక్రమం సందర్భంగా దాసు మాట్లాడుతూ భారతదేశంలో హిందూ,ముస్లిం, క్రిస్టియన్, మరే ఇతరకులమైనా, మతమైనా మనిషి మానవత్వం మరిచి మరో మనిషిని దిగంబరంగా ఊరేగించి దారుణాలకు ఒడిగట్టటం సిగ్గుచేటన్నారు. భారతదేశ రాజ్యాంగాన్ని అవమానపరచటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భారత దేశ ప్రజలందరూ మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న దారుణాల పట్ల తీవ్రంగా వ్యతిరేకించాలని, మహిళలపై అత్యాచారాలకు, హత్యల పాల్పడుతున్న దోషులకు శిక్షించే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు.

సురక్షతో అద్భుతమైన ఫలితాలు

- సామాన్యుడి సమస్య పరిష్కారానికి అండగా నిలిచిన సురక్ష
- ఈనెల 28న ధూళిపాళ్లలో జగనన్న సురక్ష ముగింపు వేడుకలు
- రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం పై సమీక్ష



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: సామాన్యుడి సమస్య పరిష్కారానికి అండగా నిలిచిన ' జగనన్న సురక్ష ' కార్యక్రమం అద్భుతమైన ఫలితాలు సాధించిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం జగనన్న సురక్ష కార్యక్రమం పై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి మంచి స్పందన లభించిందన్నారు. రాజకీయ చరిత్రలో ఏ పార్టీ, ఏ ప్రభుత్వం చేయని రీతిలో యంత్రాంగమే నేరుగా లబ్ధిదారుల వద్దకు వెళ్లి వారికి అవసరమైన గుర్తింపు పత్రాల సమాచారం సేకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రత్యేక క్యాంపు నిర్వహించి అదే రోజున ఉచితంగా పత్రాలను అందించడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ నెల 28వ తేదీన నియోజకవర్గ స్థాయి జగనన్న సురక్ష ముగింపు వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. సత్తెనపల్లి మండల పరిధిలోని ధూళిపాళ్ల గ్రామంలో నిర్వహిస్తున్న ఈ సమావేశాన్ని సమష్టి కృషితో విజయవంతం చేయాలన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 83,937 గృహాలు ఉండగా, సచివాలయ యంత్రంగం 67,253 గృహాలు సర్వే చేసిందన్నారు. ఈ సర్వేలో ప్రజల నుంచి 16,503 అర్జీలు, అభ్యర్థనలు రాగా 15,059 అర్జీలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, సమస్యల పరిష్కారం చేశామన్నారు. 90 శాతం సమస్యల పరిష్కారంలో న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీ, సత్తెనపల్లి, ముప్పాళ్ళ ,రాజుపాలెం , నకరికల్లు మండలాల ఎంపీడీఓలు జీవీ.సత్యనారాయణ, పుట్టారెడ్డి, టీ శ్రీనివాసరావు, బండి శ్రీనివాసరెడ్డి తదితరులు తమ మండలాల జగనన్న సురక్ష కార్యక్రమం పై నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో నాయకులు పక్కాల సూరిబాబు, చల్లంచర్ల సాంబశివ రావు, పెండెం బాబూరావు, రాయపాటి పురుషోత్తమరావు, భవనం రాఘవరెడ్డి, మారూరీ రామలింగారెడ్డి(చిన్నా), బొంతు వెంకటరెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, నల్లబోతు శివనారాయణ, చిలుకా జయపాల్, పులిబండ్ల అశోక్, ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు ,జేసీఎస్ ఇన్చార్జిలు, సచివాలయ కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు గుండ్లపల్లి -2లో జగనన్న సురక్ష

నకరికల్లు: మండలంలోని గుండ్లపల్లి గ్రామంలోని సచివాలయం-2 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. అన్నిశాఖల అధికారులు గ్రామానికి వచ్చి ప్రజల సమస్యల పరిష్కారానికి, సంక్షేమ పథకాలు అందించే కార్యక్రమం చేపడతారని అన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

మంత్రి అంబటి రాంబాబు



లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మంచికంటిని అభినందిస్తున్న, మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ప్రపంచ దేశాల్లో లయన్స్ క్లబ్ ద్వారా అనేక మంది సహాయ సహకారాలు అందుకొంటున్నారనీ, మనదేశంలో కూడా కరోనా సమయంలో లయన్స్ క్లబ్ విస్తృతంగా రోగులకు అండగా నిలచిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి. రాంబాబు అన్నారు. పట్టణంలో రఘురామ్‌నగర్‌లో గల వెంకటేశ్వర గ్రాండ్ ఏసీ ఫంక్షన్‌హాల్లో ఆదివారం జరిగిన 2023-24 లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సభకు క్లబ్ మాజీ అధ్యక్షుడు తవిటి. భావనారాయణ అధ్యక్షత వహించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌లు ఎన్నో ఏళ్ళ నుంచి అర్హులైన పేదలకు కంటి ఆపరేషన్స్ చేయిస్తూ ఇంకా అనేక మెడికల్ క్యాంపులు నిర్వహించడం ప్రశంసనీయం అని కొనియాడారు. ఈ సందర్భంగా నూతనంగా ప్రమాణం చేసిన అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వల్లూరి శ్రీనివాసరావు, కోశాధికారి తోట పద్మావతి, ఇతర సభ్యులను ఆయన అభినందించారు. ఇటువంటి స్వచ్ఛంద సంస్థల అభివృద్ధికి విద్యావంతులు, ఆర్థికంగా మెరుగైన వారు సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా రెండు వెట్ గ్రైండర్లు, కుట్టుమిషను, చీరలు, దుప్పట్లు, విద్యార్థులకు నోటుపుస్తకాలు వంటివి దాతలు సత్యశేఖర్, పొత్తూరి రామకోటయ్య, పెద్దింటి చంద్రయ్య, నిమ్మలపల్లి శ్రీనివాస్, డా..షకీలా శ్రీధర్ ఆర్థిక సౌజన్యంతో అందించగా వాటిని పంపిణీ చేశారు. క్లబ్ సీనియర్ సభ్యులు కంబాల వెంకటేశ్వరరావు, వై.పి. మురళి లు మాస్టర్ ఆఫ్ సెర్మనీలు గా వ్యవహరించగా పట్టణ ప్రముఖులు పక్కాల.సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివ రావు, ఎస్బీ ఐ బ్యాంకు మేనేజర్ రంగరాజన్,లయన్స్ పి.డి.జి విజయకుమారరెడ్డి, వి.డి.జి. హరిప్రసాద్, ఆర్.సి.కోటేశ్వరమ్మ, జడ్.సి తోట చిన సాంబశివయ్య, మిగిలిన క్లబ్ సభ్యులు, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

రాయితీ టమాటాలు పంపిణీ

సత్తెనపల్లి: బహిరంగ మార్కెట్‌లో పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలకు అందుబాటు లో లేకుండా కిలో రూ. 120 నుంచి రూ. 150 వరకు పలుకుతున్న టమాటాలను ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ద్వారా పేదలకు మేలు చేయడానికి కిలో రూ. 50కే రాయితీ టమాటాలను పంపిణీ చేస్తోందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబు రావు అన్నారు. ఆదివారం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదు రోజులుగా వ్యవసాయ మార్కెట్ యార్డు ద్వారా పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు కిలో రూ.50 కే రాయితీ టమాటాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మార్కెట్ యార్డ్ ప్రాంగణంలోని రైతు బజార్‌లో షాపులు కేటాయించిన డ్వాక్రా గ్రూపుల ద్వారా టమాటాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేక చొరవతో సబ్సిడీ టమాటాలను వినియోగదారులకు అందజేయడాన్ని చూసి తట్టుకోలేని ప్రతిపక్షాల కుట్రలో భాగంగా కొన్ని మీడియా సంస్థలు అసత్య ప్రచారం చేస్తున్నాయన్నారు. బహిరంగ మార్కెట్‌లో టమాటలు కొనుగోలు చేయలేని పరిస్థితుల్లో పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాలకు సబ్సిడీపై రూ.50కే కిలో చొప్పున అందించడం జరుగుతుందన్నారు. వినియోగదారులంతా సంతోషం వ్యక్తం చేస్తున్న క్రమంలో పథకం ప్రకారం టమాటాలు పంపిణీ పక్కదారి పడుతుందంటూ అసత్య ప్రచారాలు చేయడం అర్థరహితమన్నారు. ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించి ప్రభుత్వం చేస్తున్న మేలును ప్రజలకు అందించేలా చూడాలని దుష్ప్రచారాన్ని మానుకోవాలని ఆయన ఖండించారు.

జోరుగా వ్యవసాయ పనులు



అత్తలూరులో మిర్చి నారుమళ్ళ సిద్ధం చేస్తున్న కూలీలు

అమరావతి: మండలంలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఈ ఏడాది సమయానుకూలంగా వర్షాలు పడడంతో రైతాంగం ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం పత్తి, మిర్చి పంటల సాగు పనులను వేగవంతం చేశారు. మండలంలో గతేడాది 20 వేల ఏకరాలు పత్తి సాగు చేస్తే ఈ ఏడాది పుల్లశనగ, మినుము, కంది పంటలు వేయడానికి రైతులు ఆసక్తి చూపుతూ సుమారు 5వేల ఎకరాలు అపరాల సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్నారు. పత్తి విత్తనాలు విత్తి కొన్ని గ్రామాల్లో 20 రోజులు పైగా కావడంతో పత్తి మొక్కలకు కొంతమంది రైతులు ఎరువులు వేయడం ప్రారంభించారు. అలాగే జులై మాసంలో మిర్చి నారుమడులు పోయడానికి అనుకూలంగా ఉండడంతో వివిధ గ్రామాల్లో నారుమళ్ళ సాగు జోరుగా సాగుతుంది. రెండుమూడు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల భూమిలో పదును పెరగడంతో రైతాంగం వ్యవసాయ పనులు వేగవంతం చేశారు. జులై నెల పూర్తి కావస్తుండడంతో మండలంలోని అన్ని గ్రామాల్లో ఒక్కసారిగా మిర్చి నారుమడుల పనులను ప్రారంభించారు. మండలంలో సుమారు గా 3000 ఎకరాలకు పైగా మిర్చి పైరు సాగు చేసేందుకు రైతులు నారును సిద్ధం చేయడానికి మిర్చి విత్తనాలు నాటారు. ప్రస్తుతం మండలంలో ఎరువుల కొరత లేనప్పటికి మరో 20 రోజుల్లో రైతులందరు ఒకేసారి పత్తి చేలకు ఎరువులు వేయడం ప్రారంభిస్తే ఎరువుల కొరత లేకుండా వ్యవసాయశాఖ రైతుభరోసా కేంద్రాల ద్వారా ఎరువులను సిద్ధం చేసింది.

కేబుల్ వైర్లను కత్తిరించిన దుండగులు

నరసరావుపేట టౌన్: కేబుల్ వైర్లు కత్తిరించి ప్రసారాలకు అంటంకం కల్గించడంపై వి.చానల్ నిర్వాహకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ ఎస్ఐ ఎన్. వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఎస్ఎస్ అండ్ కళాశాల, ప్రకాష్‌నగర్, ఓవర్ బ్రిడ్జి ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి కేబుల్ వైర్లను కత్తిరించారు. దీంతో పట్టణంలో వి.చానల్ ప్రసారాలు శనివారం నిలిచిపోయాయి.

పల్లెలకు ఆరోగ్యదాతలు గ్రామీణ వైద్యులు



లైఫ్‌లైన్ హాస్పటల్ డాక్టర్ పి.రాజనందారెడ్డిని సన్మానిస్తున్న గ్రామీణ వైద్యులు

నకరికల్లు: పల్లెలకు ఆరోగ్యదాతలుగా గ్రామీణ వైద్యుల సేవలను కొనియాడాలని డాక్టర్ పి.రాజనందారెడ్డి అన్నారు. నరసరావుపేటలోని లైఫ్‌లైన్ హాస్పటల్ ఆధ్వర్యంలో మండలంలోని ఆర్ఎంపీ, పీఎంపి వైద్యులకు ఆదివారం సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక విలేజ్ హెల్త్‌క్లినిక్‌ల ద్వారా ప్రజలకు వైద్యసేవలు చేరువచేశారని కొనియాడారు. తమ వైద్యశాలలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పురాతన కాలంగా పల్లెల్లోను, మారుమూల ప్రాంతాల్లోను నివాసముంటున్న ప్రజలకు ప్రాథమికవైద్యం అందించి వైద్యసేవలు చేస్తున్న గ్రామీణ వైద్యుల సేవలు మరువలేనివని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఆర్ఎంపీ, పీఎంపీలకు పారామెడికల్ శిక్షణనిచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి గ్రామీణ వైద్యులకు తగిన గుర్తింపు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం సీనియర్ ఆర్ఎంపీ వైద్యులు షేక్.చింతపల్లి ఫకీర్‌అహ్మద్, రత్నం, రమణారెడ్డి, హుస్సేన్, ఆచారి, బ్రహ్మంలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎంపీఏ డివిజన్ అధ్యక్షుడు షేక్.బాజి, డాక్టర్ పి.రాజ్యలక్ష్మి, డాక్టర్ ప్రసన్న లక్ష్మి, ఆర్ఎంపీ యూనియన్ నాయకులు చెన్నారెడ్డి, సైదా, నారాయణ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకే మన వార్డు-మన ఆరోగ్యం



పట్టణంలోని 1వ వార్డులో పర్యటిస్తున్న కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వర రావు

సత్తెనపల్లి: పరిసరాల పరిశుభ్రతకే మన వార్డు-మన ఆరోగ్యం నిర్వహించడం జరుగుతుందని వైఎస్సార్ సీపీ ఒకటవ వార్డు కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరరావు అన్నారు. క్షేత్రస్థాయిలో వార్డులో నెలకొన్న సమస్యలను తెలుసుకునేందుకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సూచనల మేరకు ఆదివారం 1వ వార్డులో మన వార్డ్-మన ఆరోగ్యంలో భాగంగా స్థానిక నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా 1వ వార్డ్ అభివృద్ధి కార్యక్రమంలో జరిగినటువంటి అభివృద్ధి పనులు సీసీ రోడ్ల నిర్మాణం, మురికి కాలువలు నిర్మాణం వంటి వాటిని పరిశీలించారు. వర్షం కారణంగా వార్డ్‌లోని ఖాళీ స్థలాల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కల తొలగింపు, కాలువలు శుభ్రం చేయుట వంటి సమస్యలు గురించి వార్డ్ శానిటేషన్ సెక్రటరీ నాగరాజుకు సూచించారు. ఆయా సమస్యలు త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా వార్డ్ లోని ప్రజలను కలిసి స్థానికంగా నెలకున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరింప చేయిస్తామని హామీ ఇచ్చారు. వర్షం కారణం వచ్చే దోమలు వాటి వల్ల జరిగే నష్టాలు ప్రజలకి అర్థం అయ్యేలా చెప్పి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి అని సూచించారు. ప్రతి ఆదివారం నేరుగా ప్రజల వద్దకు వచ్చి తమ సమస్యలు నేరుగా తెలుసుకొని ఆయా సమస్యలు పరిష్కరించడం చాలా బాగుంది అని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

మంచి జరిగిందనుకుంటేనే ఆశీర్వదించండి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



ఇంటింటికి తిరిగి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: గత ప్రభుత్వంకన్నా మనందరి ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి మంచి జరిగిందనుకుంటేనే తిరిగి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంబడిపూడిలో ఆదివారం సాయంత్రం ఆయన ఇంటింటికి తిరిగి సంక్షమే పథకాలు వివరించారు. గత నాలుగేళ్లలో ఏకుంటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కరపత్రాలను పంపిణీ చేశారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారులతో అక్కడిక్కడే మాట్లాడి పరిష్కారానికి సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వానికి మన ప్రభుత్వానికి వ్యత్యాసాన్ని తెలుసుకోవాలన్నారు. నాడు-నేడు పథకం ద్వారా విద్య, వైద్య రంగాలను బలోపేతం చేసిన తీరు, సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వాన్ని తెచ్చిన వైనం తెలుసుకోవాలన్నారు. కోగంటివారిపాలెం సచివాలయ పరిధిలో గత నాలుగేళ్లలో రూ. 6కోట్ల మేర అభివృద్ధి పనులు జరిగాయని అందులో కనీసం 10 శాతమైన గత ప్రభుత్వంలో జరిగిందా అని ప్రశ్నించారు. చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడి మాటలు విని మోసపోవద్దని, సంక్షేమ పథకాలన్నీ యథావిధిగా కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించాలన్నారు. తాను మళ్లీ గెలవగానే సీఎం జగన్ సహకారంతో నియోజకవర్గంలో ఒక పరిశ్రమను ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్నారు. ముందుగా గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సీహెచ్‌ఎస్సార్కే సాయిరెడ్డి, సర్పంచ్ కొమ్మవరపు జనపరిబాబు, పెద్ద వెంకటేశ్వర్లు, బీసీ నాయకులు సాతర్ల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దార్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పలువురు వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరుతున్న చిగురుపాడు ఉపసర్పంచ్ శివగంగ, ఆరుద్రశ్రీను

అచ్చంపేట: చిగురుపాడు గ్రామ ఉప సర్పంచ్ ఎనుముల శివగంగ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో తన అనుచర వర్గంతో ఆదివారం టీడీపీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు జరుగుతున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా ఎవరి ప్రమేయం లేకుండా, లంచాలకు తావులేకుండా నేరుగా బ్యాంకు ఖాతాలకు సంక్షేమ ఫలాలు అందచేస్తున్నారన్నారు. అందువల్లనే తాము టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు ప్రముఖ టీడీపీ నేత ఆరుద్ర శ్రీను కూడా తన అనుచరులతో వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, మార్కెట్ యార్డు డైరెక్టరు ఆకుల కోటేశ్వరరావు, మువ్వా శ్రీనివాసరావు, జిల్లా బీసీసెల్ కన్వీనర్ సాతర్ల శ్రీనివాసరావు, బీసీ నాయకులు మేకల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో కొనసాగుతున్న సమగ్ర సర్వే




ముప్పాళ్ళలో సమగ్రసర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ భవానిశంకర్

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను సమగ్ర ఓటరు సర్వే ప్రక్రియ జరుగుతున్నట్లు తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్ చెప్పారు. ముప్పాళ్ళలో జరుగుతున్న సర్వే ప్రక్రియను ఆదివారం పరిశీలించారు. వచ్చే నెల 21వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కు నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓట్లు గుర్తించి వాటిని తొలగించాలని సూచించారు. దీర్ఘకాలికంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళిన వారి ఓట్లను వారి అభీష్టం మేరకు ఏ ప్రాంతంలో ఉంచాలో కనుక్కొని అక్కడ జాబితాలో ఉంచడం. ఓటరు అభ్యర్థన మేరకు ఒక చోటు నుంచి మరో చోటుకు మార్చడం చేయాలన్నారు. గుర్తింపు కార్డులు, జాబితాల్లోని తప్పుల సవరణ, స్పష్టత లేని ఫోటోలు తొలగించి, మంచి ఫోటోలు ఏర్పాటు చేసేందుకు దరఖాస్తు స్వీకరించాలన్నారు. ఆయా గ్రామాల్లో బీఎల్ఓ లు ఇంటింటికి తిరిగి సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి బలవన్మరణం

నాదెండ్ల: అనారోగ్యంతో బాధపడుతూ పురుగుమందు తాగి వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన తూబాడు పంట పొలాల్లో చోటు చేసుకుంది. ఎస్ఐ జె. బలరామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తూబాడు గ్రామానికి చెందిన రావూరి డేవిడ్ (45) నాలుగేళ్లుగా ప్రకాశం జిల్లా పర్చూరు మండలం, పోతుకట్లలో నివాసం ఉంటున్నాడు. ఏడాది కిందట వీధి కుక్క కరిచింది. అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా స్వస్థత చేకూరకపోడంతో మనస్తాపానికి గురయ్యాడు. మూడు రోజుల కిందట ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకులాట ప్రారంభించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం పొలాల్లో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహం పక్కనే పురుగుమందు డబ్బా పడి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహం జేబులోని సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భార్య రావూరి సువార్తమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రాజుపాలెంలో త్రైత సిద్ధాంతం ప్రచారం



రాజుపాలెం: నరసరావుపేటకు చెందిన త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి, హిందూ జ్ఞాన వేదికకు చెందిన త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం మండలంలోని రాజుపాలెం, కోటనెమలిపురి గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ప్రభోద సమితీ అధ్యక్షుడు కడియం పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఆషాఢమాసంలో చందమామ గుండ్రంగా, పెద్దదిగా ఉండడం వల్ల గురు పౌర్ణమిగా నిర్ణయించి సాక్షాత్తు శ్రీకృష్ణునిని మాత్రమే జగద్గురువుగా భావించి గురు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏజెంట్ రమేష్, పగడాల రామయ్య, వసంతపు తిరుపతిరావు, చల్లగుండ్ల భాస్కరరావు, పోతురాజు, కుంచాల చిన్నవెంకయ్య, కోవూరి చిన్న వెంకటేశ్వర్లు, పగడాల అశోక్, వెచ్చ రాజశేఖర్, మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.